క్లుప్తంగా

రబీ సాగుకు అందుబాటులో యూరియా

పెనమలూరు: రబీ పంట సాగుకు రైతుల కోసం యూరియా అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ అన్నారు. ఆమె మండల కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ.. మండలంలో రబీ వరి సాగు 5,500 ఎకరాల్లో ఉంటుందని పేర్కొన్నారు. దీనికి గానూ 500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని.. ముందస్తు చర్యల్లో భాగంగా 90 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులు యూరికా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూరియా ప్రభుత్వ ధరకు మించి ఎవరైనా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీకేఆర్ కళాశాలకు పుస్తకాలు వితరణ



గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలకు మూల్పూరు సత్యనారాయణ, విజయలక్ష్మీ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ పుస్తకాలను వితరణ చేశారు. ఈ మేరకు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావుకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాలలో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థుల ప్రయోజనార్థం విలువైన పుస్తకాలను అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. జేఈఈ మెయిన్స్, ఐఐటీ అడ్వాన్స్, మెడికల్ నీట్, బిట్స్ వంటి దేశ స్థాయి పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాతలు మూల్పూరు సాంబశివరావు, సతిసక్కుబాయి, గాంధీ, మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

వల్లభనేని రమేష్‌చంద్‌కు నివాళులు



గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ తన తండ్రి వల్లభనేని రమేష్‌చంద్ 10వ వర్ధంతి కార్యక్రమాన్ని మండల కేంద్రమైన ఉంగుటూరులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌చంద్, అరుణ దంపతుల చిత్రపటాలకు వంశీ కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించి రమేష్‌చంద్ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఓలుపల్లి మోహన్‌రంగా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా పి.నైనవరం రోడ్డు



పి.నైనవరం(విజయవాడ రూరల్): పి.నైనవరం గ్రామంలోని ఆర్అండ్‌బీ రోడ్డులో గుంతలు ఏర్పడడంతో గ్రామస్తులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. మసీదు సమీపంలో రోడ్డు గుంతలమయంగా ఉండడంతో వర్షం పడిన సందర్భంలో వర్షం నీరు గుంతల్లో నిలబడుతోంది. దీంతో వర్షం నీటిలోనే నడవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డును ఆనుకొని ఉన్న డ్రెయిన్‌లో మురుగు రోడ్డు పైకి రావడంతో ప్రయాణం ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో జేసీ విస్తృత పర్యటన

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా పునాదిపాడు, కోలవెన్ను రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. అక్కడి సిబ్బంది ధాన్యం సేకరణకు సంబంధించి ఎలాంటి సన్నాహక చర్యలు చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణ, రవాణా చర్యలపై సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. ధాన్యం సేకరణలో తలెత్తే సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించి రైతులకు మేలు చేసేలా ధాన్యం సేకరణ ఉండాలన్నారు. నిబంధనలు పాటించాలని ఆదేశించారు. దావులూరు గ్రామంలోని బాలాజీ మిల్లును జేసీ సందర్శించారు. ధాన్యం సేకరణ సమర్థంగా సాగేలా చూడాలని సూచించారు. పర్యటనలో ఆర్‌డీవో హెలా షారోన్, తహసీల్దార్ వి.భావనారాయణ, ఏవో ఉషా రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పశుసంపద వృద్ధికి పాడిరైతులకు రాయితీలు

చేయూతనందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



పాడిరైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న ఏడీ ప్రమీలారాణి, సర్పంచ్ అంజిబాబు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పశుసంపదను వృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాడిరైతులకు పలు రాయితీలు కల్పిస్తున్నాయని పశుసంవర్ధక శాఖ బాపులపాడు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమీలారాణి అన్నారు. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ అడపా అంజిబాబు ప్రారంభించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద ప్రతి మండలంలోనూ పశువైద్య శిబిరాలను నిర్వహిస్తూ, పశు పోషణ, సంరక్షణపై పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు డాక్టర్ ప్రమీలారాణి పేర్కొన్నారు. పెయ్య దూడల ఉత్పత్తి పథకం లబ్ధిదారులకు ప్రభుత్వ రాయితీలతో పాటు కృష్ణా మిల్క్ యూనియన్ కూడా సబ్సిడీ అందిస్తుందని ఆమె తెలిపారు. శిబిరంలో శేరినరసన్నపాలెం, కె.సీతారామపురానికి చెందిన పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స అందజేశారు. పాడి పశువులకు అవసరమైన మందులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ వై.హారిత, కానమోలు ప్రభుత్వ పశు వైద్యశాల అధికారి డాక్టర్ ఇ.రేవతి, ఉప సర్పంచ్ సాంబశివరావు, పాల కేంద్రం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

182 మందికి ఉచిత వైద్య శిబిరం..

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకోవచ్చని లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్ చక్రవర్తి అన్నారు. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్, మెడివ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, రక్తపోటు, మధుమేహం, ఎముకలు, కీళ్లు, గర్భాశయ, గుండె, దంత, ఈఎన్‌టీ సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. సుమారు 182 మంది ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు మందులు పంపిణీ చేశారు. శిబిరంలో సర్పంచ్ అడపా అంజిబాబు, ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ పంచకర్ల సుధ, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ జె.అభిషేక్, గైనకాలజిస్ట్ డాక్టర్ వినీలా, దంత వైద్య నిపుణులు డాక్టర్ స్పందన, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుధ

పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

గన్నవరం: గ్రామపంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆ సంఘ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జీటీవీ రమణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గుడివాడ డివిజన్ పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల నిర్వాహణలో కీలకమైన కార్యదర్శులపై పని ఒత్తిడి పెరిగిపోతోందన్నారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులందరూ ఐక్యంగా ఉంటూ సమస్యలపై కలిసి ముందుకువెళ్లాలని సూచించారు. సంఘం గుడివాడ డివిజన్ అధ్యక్షులు వి.హరికృష్ణ మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి అందరూ కలిసి రావాలని కోరారు. ఐవీఆర్ ఫోన్ కాల్స్ నుంచి పంచాయతీ కార్యదర్శులను మినహాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.స్వర్ణలత, ఈవోపీఆర్డీ భారతి, సంఘం జిల్లా అధ్యక్షులు కె.నరసింహారావు, ప్రధాన కార్యదర్శి కె.రామ్మోహన్‌రావు, డివిజన్ కార్యదర్శి టి.లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శి చోరగుడి ప్రసాద్, మండల అధ్యక్షులు ఎస్.చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినీలు

తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలు సమీపంలోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మేరా యువ భారత్(మై భారత్) కార్యక్రమంలో భాగంగా బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. తొలుత ఈ పోటీలను కళాశాల డైరెక్టర్ సుంకర రామబ్రహ్మం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిట్ ఇండియా, ఫిజికల్ యాక్టివిటీస్‌ను ముందుకు తీసుకువెళ్లడంలో మేరా యువ భారత్ దోహదపడుతుందన్నారు. అనంతరం పురుషులు, మహిళల విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, షాట్‌పుట్, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్, అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీహరి, ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు సిగ్గుచేటు

ఆర్‌డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేత



ఉయ్యూరు ఆర్‌డీవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల బాధ్యులు

కంకిపాడు/పెనమలూరు/ఉయ్యూరు/ఉయ్యూరు రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోందంటూ ప్రజాసంఘాలు, జర్నలిస్టులు దుమ్మెత్తిపోశారు. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయాలని చూడడం సిగ్గుచేటని వారంతా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో సాక్షి మీడియా, ఎడిటర్ ధనుంజయరెడ్డి, రిపోర్టర్లపై సాగుతున్న దాడులను నిరసిస్తూ జర్నలిస్టులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉయ్యూరు ఆర్‌డీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆర్‌డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూఎఫ్ఆర్‌టీఐ రాష్ట్ర కోకన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్, దళిత ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పినమాల నాగకుమార్, ఉయ్యూరు మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, యూఎఫ్ ఆర్‌టీఐ కోస్తా జిల్లాల కన్వీనర్ బేతపూడి జోగేశ్వరరావు, కౌన్సిలర్ గోన మదన్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, వైఎస్సార్‌సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మనాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు రమావత్ శ్రీకాంత్, నాయకులు గడ్డం చైతన్య, మెండాల వీరరాఘవ, నాగబాబు, తూమాటి గిరీష్, పాత్రికేయులు, పాత్రికేయ సంఘాల ప్రతినిధులు ఈడా శివప్రసాద్, జంపాన రఘుబాబు, పోలవరపు వాసుదేవ్, జె.వెంకటప్పయ్య, మరీదు రాజా, అజయ్, దేవరపల్లి అజయ్‌కుమార్, తుంగల ప్రదీప్, వంపుగడవల జానీ, బాషా, ఫైజా, రమణ, తూమాటి సుధాకర్, సమతా సైనిక్ దళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో కుటుంబాలు విచ్ఛిన్నం



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థులు

పెనమలూరు: మాదకద్రవ్యాలకు అలవాటుపడితే కుటుంబాలు విచ్ఛిన్నమవ్వడమే కాకుండా భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఎస్ఐ ఉషారాణి అన్నారు. పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రశంగించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందన్నారు. గంజాయికి అలవాటు పడి భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించి ఏ సమాచారం ఉన్నా ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు ఫోన్ చేయాలని, వివరాలు చెప్పిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈవో కనకమహాలక్ష్మి, హెచ్‌ఎం సుమలత, ఈగల్ టీం ఎస్ఐ రాంబాబు, ఆకర్ష ఫౌండేషన్ ప్రతినిధి జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలయేసు మందిరంలో నవదిన ప్రార్థనలు



గన్నవరం: స్థానిక అద్భుత బాలయేసు మందిరంలో వార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం నవదిన ప్రార్థనలు, జపమాల, దివ్యసత్ప్రసాద ఆశీర్వాదం నిర్వహించారు. అనంతరం ప్రావెన్షియల్ ఆఫ్ మిషనరీస్ ఆఫ్ ఫైత్, అజ్జంపూడి విచారణ కర్తలు రెవ. ఫాదర్ రాజు నేతృత్వంలో పలువురు గురువులు దివ్యబలిపూజను సమర్పించారు. రెవ. ఫాదర్ ఎస్.వినయ్‌కుమార్ విశ్వాసులకు సందేశం ఇచ్చారు. అనంతరం మరియదళ గాయక బృందం ఆలపించిన క్రైస్తవ గీతాలు విశ్వాసులను ఆకట్టుకున్నాయి. ఆర్‌సీఎం విచారణ కర్తలు ఫాదర్ పసల థామస్, దైవార్చన నిర్వాహకులు దేవరపల్లి రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ మహిళా అధ్యక్షురాలిగా బాలి



ఉయ్యూరు: వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ మహిళా అధ్యక్షురాలిగా దారావత్తు బాలి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. నూతనంగా నియమితులైన బాలి మర్యాదపూర్వకంగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తిని శుక్రవారం కలిశారు. ఆమెను చక్రవర్తి సత్కరించి అభినందనలు తెలిపారు. మహిళల సమస్యలపై స్పందిస్తూ పార్టీని పటిష్టం చేయాలని ఆమెకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో నూతనంగా నిర్మించిన శ్రీగంగానమ్మ తల్లి దేవస్థానం ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆగమాచార్య, శతాధిక ప్రతిష్టాపనాచార్య పరాశరం రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గంగానమ్మ తల్లి, పోతురాజు స్వామివార్ల విగ్రహ ప్రతిష్టను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి ప్రతిష్టా మహోత్సవానికి హాజరయ్యారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

ఉయ్యూరు: చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఉయ్యూరు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి కె.శ్రీహరి తీర్పునిచ్చారు. సీనియర్ అడ్వకేట్ టి.చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఉయ్యూరుకు చెందిన దున్నల మాధవి నుంచి అదే పట్టణానికి చెందిన టి.నాగరాజు 2020 డిసెంబరు 13న రూ 5.15 లక్షలు ఫోన్ పే ద్వారా, రూ.2.50 లక్షలు ప్రామిసరీ నోటు రాసి అప్పుగా తీసుకున్నారు. బాకీ నిమిత్తం నాగరాజు 2022 నవంబరు 20న మాధవికి రూ.6 లక్షల చెక్కు ఇచ్చారు. చెక్‌బౌన్స్ అవ్వడంతో మాధవి ఉయ్యూరు కోర్టులో చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశారు. న్యాయవాది చంటిబాబు వాదనలు వినిపించి నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి శ్రీహరి నిందితుడు నాగరాజుకు ఏడాది జైలుశిక్ష, ఆ రూ.6 లక్షల చెక్కుకు గానూ రూ.7.57 లక్షల నష్టపరిహారం మాధవికి చెల్లించాలని తీర్పునిచ్చారు.

వ్యవసాయ మోటార్లు, తీగలు దొంగిలించిన కేసులో ఆరు నెలలు..

హనుమాన్‌జంక్షన్ రూరల్: పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ మోటార్లు, వైర్లు ధ్వంసం చేసి రాగి తీగలను దొంగిలించిన దుండగులకు నూజివీడు కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళ్లితే.. బాపులపాడు మండలంలోని వీరవల్లి, కోడూరుపాడు, రంగన్నగూడెం గ్రామాల్లో గత ఏడాది డిసెంబరు నుంచి వరుసగా మూడు నెలల పాటు పలుచోట్ల పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ మోటార్లు, వైర్ల చోరీలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలపై బాధితులు, విద్యుత్ అధికారుల ఫిర్యాదుల మేరకు వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్ ఏడు వేర్వేరు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసులో నిందితులైన పంబి శ్రీను, ముత్యాల గోపాలకృష్ణ, వెన్నముద్దల దుర్గాప్రసాద్‌లను పోలీసులు అరెస్ట్ చేసి నూజివీడు కోర్టుకు హాజరుపర్చారు. శుక్రవారం న్యాయమూర్తి తుదితీర్పు ప్రకటించారు. నేరం రుజువుకావడంతో నిందితులకు ప్రతి కేసులో ఆరు నెలలు చొప్పున సాధారణ జైలు శిక్ష విధిస్తూ రెండో అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో తీర్పు వెల్లడించారు.

ఉత్తరాంధ్ర వాసులకు స్థలదానం

రామవరప్పాడు: నిడమానూరు మాజీ సర్పంచ్ పరిమి రమేష్ కుమారుడు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పరిమి వంశీ, కోడలు పరిమి సింధూర గ్రామంలోని రూ.3 లక్షలు విలువజేసే స్థలాన్ని ఉత్తరాంధ్ర వాసుల సౌకర్యార్థం దానంగా అందజేశారు. గ్రామంలో ఎప్పటి నుంచో నివాసం ఉంటున్న వారు అంత్యక్రియలు అనంతరం నిర్వహించే ప్రార్థనలు, స్మరణ కార్యక్రమాల కోసం ఈ వితరణ అందించామని పేర్కొన్నారు. స్థలదానంతో పాటు రూ.2 లక్షల విలువైన భవనం కూడా స్థలంలో నిర్మించి ఇవ్వనున్నట్లు వివరించారు. గ్రామ సర్పంచ్ శీలం రంగారావు, పరిమి విష్ణు, ఉత్తరాంధ్ర వాసుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి



విశ్వవిద్యాలయం ఆవరణలో చెత్త ఊడ్చుతున్న ఉపకులపతి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు

పెనమలూరు: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రతపై అవగాహనతో ఉండాలని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. యూనివర్సిటీలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపకులపతి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. యూనివర్సిటీ ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగించవద్దని తెలిపారు. విద్యార్థులు ప్రాంగణంలో పరిశుభ్రత పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. పచ్చదనం లక్ష్యంగా మొక్కలు నాటాలన్నారు. ఈ సందర్భంగా ప్రాగణంలో చెత్త ఊడ్చి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రో ఉపకులపతి డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ జె.శివరామ్‌ప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎం.రాజేష్, కొల్లా నరేంద్ర పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్మికులకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్లు పోలవరపు విజయభాస్కర్, నాదెళ్ల ఆదిత్య

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ తెలిపారు. కానూరు సోమనాథ్ ఆసుపత్రిలో శుక్రవారం సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన వివరాలు వెల్లడించారు. బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన నెల సందర్భంగా అను ఒమేగా ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ శిబిరం ఈనెల 26, 27 తేదీల్లో కానూరు వెలగపూడి కోల్డ్ స్టోరేజీ ఆవరణలో నిర్వహిస్తామని అన్నారు. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేస్తామని.. బీపీ, షుగర్ వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తామని వివరించారు. డాక్టర్ నాదెళ్ల ఆదిత్య మాట్లాడుతూ.. మొబైల్ బస్సులో మామూగ్రాం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తామని తెలిపారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రూట్స్ సభ్యులు ఎంఎస్ఆర్ శర్మ, క్రాంతి, భానుప్రకాష్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు సీజేపై దాడికి నిరసనగా ర్యాలీ



డీటీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గన్నవరం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో గన్నవరంలో నిరసన తెలియజేశారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన జరిపారు. అనంతరం డెప్యూటీ తహసీల్దారు దుర్గా భవానీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మంద వేణు మాట్లాడుతూ.. జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించాలని తెలిపారు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సీజేపై జరిగిన దాడిని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని ఎంఈఎఫ్ నాయకులు దేవరపల్లి విక్టర్‌బాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచి నిడమర్తి సౌజన్య, ఎమ్మార్పీఎస్ నాయకులు కోటా కృష్ణమోహన్, కొప్పుల కామేశ్వరరావు, పచ్చిగళ్ల భాస్కర్, కొలపాల పాస్కల్, పురిటిగడ్డ దేవదాసు, గొన్నూరు శ్రీనయ్య, దేవరపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి



తాడిగడపలో నిరసన తెలుపుతున్న మహిళలు

పెనమలూరు: మహిళలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు అరికట్టాలని.. మహిళలకు భద్రత పెంచాలని ఐద్వా మండల కార్యదర్శి పాతాళ లక్ష్మి డిమాండ్ చేశారు. తాడిగడపలో శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న రైల్లో మహిళా బోగిలో ప్రయాణిస్తున్న మహిళపై ఓ వ్యక్తి అత్యాచారం చేయడం దారుణమన్నారు. బాధిత మహిళను చంపుతానని బెదిరించి ఆమె వద్ద సొమ్ము, ఆభరణాలు ఎత్తుకు వెళ్లాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై రైల్వే అధికారులు కానీ, పోలీసులు కానీ స్పందించలేదన్నారు. రైళ్లలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు బాధ్యుడైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు భవానీ, రమణ, వాణి, రమ తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధిలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాత్ర గణనీయం



గన్నవరం రూరల్: భారతదేశం అభివృద్ధిలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాత్ర ఘనమైనదని బ్యాంక్ జోనల్ హెడ్ దారాసింగ్ నాయక్ పేర్కొన్నారు. ముస్తాబాద గ్రామంలో శుక్రవారం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంలో, సమాజ ప్రగతిలో బ్యాంకు ముందు వరుసలో ఉందన్నారు. గ్రామీణ భారతావని అభివృద్ధిలో గణనీయ పాత్ర పోషించిందని తెలిపారు. పారిశ్రామిక, వ్యవసాయ, వ్యాపార, రైతులకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. బ్రాంచ్ మేనేజర్ కోదాడకృష్ణ బ్రాంచ్ ప్రగతిని గ్రామస్తులకు వివరించి, సేవలను వినియోగించుకోవాలన్నారు. బ్యాంకు సిబ్బంది, విజయవాడ జోన్ అధికారులు, రీజినల్ హెడ్ సతీష్‌బాబు, గాంధీ, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.